ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4 కనిష్ఠం 20.1
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
మంగళవారం 13 ఫిబ్రవరి 2024




నేటి నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

లింగంపేట, ఫిబ్రవరి12: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం 13వ తేది నుంచి సమ్మె చేస్తున్నట్లు సోమవారం డీఈవోకు సమ్మె నోటీసు అందజేశారు. కొన్నినెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని, దీంతో చేసిన అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రతీనెల 10 వరకు బిల్లులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేండింగ్ బిల్లులు చెల్లించే వరకు నేటి నుంచి సమ్మె చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు శివ్వయ్య, సురేష్, కార్మికులు ఉన్నారు.



- ఎస్‌డీఎఫ్ వినియోగ బాధ్యత ఇన్‌చార్జి మంత్రికే
- ఒక్కో ఎమ్మెల్యేకు రూ.10కోట్ల చొప్పున కేటాయింపు
- వచ్చే నెలాఖరు వరకు వ్యయం చేయడానికి అవకాశం
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర సర్కారు

జిల్లాకు రూ.30.05 కోట్లు



కామారెడ్డి, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు జిల్లా ప్రత్యేక అభివృద్ధి (ఎస్‌డీఎఫ్) నిధులు రూ.30.05 కోట్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యేల విజ్ఞప్తులు లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు రూ.30.05 కోట్లు కేటాయిస్తూ జీవో జారీచేసింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి బాధ్యతలను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు అప్పగించింది. ఈ నిధులను మార్చి 31లోగా ఖర్చుచేసేందుకు అవకాశమిచ్చింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు సంబంధితశాఖ అధికారుల ద్వారా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి నివేదించాల్సి ఉంటుంది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు వాటిని ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో చేపట్టే పనుల ప్రతిపాదనల తయారీ కసరత్తులో నిమగ్నమయ్యారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత నిధుల వినియోగంపై దృష్టిసారించారు.

ఎమ్మెల్యేలు అడగకుండానే..

సాధారణంగా ఎస్‌డీఎఫ్ నిధులను ఎమ్మెల్యే విజ్ఞప్తుల మేరకే ప్రభుత్వం విడుదల చేస్తోంది. తమ నియోజకవర్గ పరిధిలో ఫలానా పనులు చేపట్టాల్సి ఉందని అందుకు ప్రత్యేకనిధులను కేటాయించాలని ఎమ్మెల్యేలు సీఎంను కోరితే అందుకు అనుగుణంగా నిధులు విడుదలయ్యేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతోపాటు తెలంగాణ సర్కార్‌లో సైతం ఇలాగే జరిగేది. కానీ కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు ఎమ్మెల్యేలకు అడగకుండానే ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నిధులను కేటాయించింది. జిల్లాలో ఎల్లారెడ్డి, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండగా కామారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో ప్రతిపక్షాలు బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అధికారపార్టీ ఎమ్మెల్యేలతోపాటు విపక్ష పార్టీ ఎమ్మెల్యేలను సైతం తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం నిధులు విడుదలచేసింది.

ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోజనం

ఎస్‌డీఎఫ్ నిధుల వినియోగంలో ప్రభుత్వ విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. ఒక్కో ఎమ్మెల్యేకు కేటాయించిన రూ.10 కోట్లలో రూ.2కోట్లను ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేయాలని ఆదేశించింది. మరో రూ.కోటిని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వినియోగించాలని సూచించింది. మరో రూ.50 లక్షలను కలెక్టర్, జిల్లా అధికారుల ప్రతిపాదనల మేరకు కార్యాలయాల నిర్వహణ కోసం వినియోగించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొంది. పాఠశాలలు, తాగునీరు, కార్యాలయ నిర్వహణకు సంబంధించి రూ.3.05 కోట్లు పోగా మిగిలిన రూ.6.05 కోట్లను తమ నియోజకవర్గ పరిధిలోని చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు వినియోగించుకోవడానికి ఎమ్మెల్యేలకు సూచించింది. ఈ నిధులను మార్చి 31లోగా ఖర్చు చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ నిధులతో చేపట్టిన పనులు పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక తనిఖీలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. తద్వారా నాణ్యత ప్రకారం జరిగేందుకు అవకాశం ఉంటుంది. నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యేల్లో హర్షం వ్యక్తమవుతోంది.

తాగునీరు అందని గ్రామాలపై సర్వే

జిల్లాలో ఏయే ప్రాంతాలకు తాగునీరు అందడం లేదో సమగ్రసర్వే నిర్వహించాలని ఇటీవల అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత ఇంజనీర్లు, ఆయా గ్రామాలకు వెళ్లి నిజనిర్ధారణ బృందం చేసినట్లుగానే పక్కగా తాగునీరు అందని ఆవాసల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. జల జీవన్ మిషన్ నిధులు రాబట్టుకునేలా కొత్త ప్రతిపాదనలు తయారుచేసి కేంద్రానికి పంపించడానికి కసరత్తు చేస్తున్నారు. అత్యవసరమైన ప్రాంతాల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ద్వారా ఎస్‌డీఎఫ్ నిధులను కేటాయించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. అదే విధంగా రోడ్డుసౌకర్యం లేని గ్రామాల్లో రోడ్లను నిర్మించడానికి అవసరమైతే ఉపాధిహామీ నిధులను అనుసంధానించి పూర్తిచేయడానికి కసరత్తులు జరుగుతున్నాయి.

కొత్తగా చేపట్టే పనులకు ఎస్‌డీఎఫ్

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాలలోని ఆయా మండలాల్లో కొత్తగా చేపట్టబోయే పనులకు మాత్రమే జిల్లా ప్రత్యేక అభివృద్ధి నిధులను కేటాయించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిధులతో చేపట్టే పనులు ఇంతకముందు ఏ పథకం కింద చేసి ఉండకూడదని స్పష్టం చేసింది. ఆయా ఎమ్మెల్యేల సమన్వయంతో పనులను ప్రతిపాదించి ముందుకు వెళ్లడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు కూడా తమ పరిధిలోని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేకునేందుకులా సమాచారం సేకరిస్తున్నారు.

బాబోయ్ బైకు దొంగలు

- బాన్సువాడలో మాయమవుతున్న బైకులు
- భయాందోళనలో వాహనదారులు
- దొంగతనాలను అరికట్టాలని వాహనదారుల వేడుకోలు



బాన్సువాడటౌన్, ఫిబ్రవరి 12: బాన్సువాడ పట్టణంలో బైకు దొంగలు రెచ్చిపోతున్నారు. ఇలా పార్కు చేసిన రెప్పపాటు క్షణాల్లోనే ద్విచక్రవాహనాలు మాయమైపోతున్నాయి. ఎంతో ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన బైకులు ఇట్టే దొంగతనాలకు గురవుతుండడంపై వాహన ఆందోళన చెందుతున్నారు. బైక్ పోయిందని.. కనబడితే ఫోన్‌కు సమాచారం అందించాలంటూ వాహనదారులు వాట్సాప్ గ్రూపులలో బైక్ ఫొటోలు పెడుతున్నారు. బైకు దొంగతనానికి గురైందంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయడంతోపాటు సామాజిక మాధ్యమాల్లో సైతం తమ వాహన ఆచూకీ కోసం వెతుకుతూ ఉన్నారు. రద్దీగా ఉన్న ప్రాంతాల నుంచి దొంగలు కనురెప్పపాటులో బైకులను దొంగిలిస్తున్నారని వాహన యజమానులు వాపోతున్నారు.

బాన్సువాడలో మాయమవుతున్న బైకులు

బాన్సువాడ పట్టణంలో బైకులు మాయమవుతున్నాయి. తాళం వేసిన వాహనాలను సైతం దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ఆస్పత్రులు, అంగడిబజార్, ఇళ్లు ఇలా బైకులు ఎక్కడ పార్కింగ్ చేసినా కనురెప్పపాటులో మాయమవుతున్నాయని వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వాహన జాడ కోసం విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు చేసేదేమీ లేక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి బాధతో ఇంటిముఖం పడుతున్నారు. బైకులు బయటకు తీసుకవచ్చినాపార్కి ంగ్ చేయాలంటే జంకాల్సిన పరిస్థితి నెలకొంది.

సీసీ కెమెరాల ఆవశ్యకత

బాన్సువాడ పట్టణం మున్సిపాలిటీ పరిధిలో రద్దీ బాగా పెరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వివిధ పనుల నిమిత్తం వాహనాలపై వస్తూ ఉంటారు. అయితే పెట్టిన చోట నుండే వాహనం అ దృశ్యమైతే ఆ యజమాని పడే అంతా ఇంతా కాదు. ప్రస్తుతం పట్టణంలో సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంతోగానో ఉంది. దొంగతనాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు తోడ్పతాయి. గతంలో పోలీసు అధికారులు పట్టణంలోని పలు కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో పోలసులకు సమాచారం తొందరగా లభ్యమయ్యేది. కానీ వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. పోలీసు అధికారులు చర్యలు తీసుకుని సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు బాన్సువాడలో దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దొంగతనాలను అరికడతాం..
కృష్ణ , పట్టణ సీఐ , బాన్సువాడ

బాన్సువాడ పట్టణంలో దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. పట్టణంలో పోలీసులతో పెట్రోలింగ్ చేయిస్తున్నాం. ముందుగా సీసీ కెమెరాలను తిరగి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- డీఆర్‌డీవో సాయన్న
- ప్రజావాణికి 72 వినతులు



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 12: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలని, సమస్య సత్వరమే పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని డీఆర్‌డీవో సాయన్న అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయన్న ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 72 ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. ఇందులో అందులో రెవెన్యూ శాఖ సంబంధించి 27, డిస్ట్రిక్ట్ కలెక్టరేట్ 3, సివిల్ సప్లయ్ 1, డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ 10, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీస్ 2, డీపీవో ఆఫీస్ 5, డబుల్‌బెడ్‌రూం 15, మున్సిపల్ 2, డీఆర్‌డీవో 1, ఎస్‌సీ డెవలప్‌మెంట్ 1, ఎస్‌పీ ఆఫీస్ 1, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు 3 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏవో మసూర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

- ముగ్గురు వైద్య సిబ్బందిపై వేటు
- ఆసుపత్రి సూపరిటెండెంట్ సరెండర్
- శానిటేషన్ లోపాలు ఉంటే వైద్యుల సస్పెన్షనా?
- సస్పెన్షన్‌ను ఎత్తివేయకుంటే పోరాటం: టీటీజీడీఏ
- ఘటనపై ఆరా తీసేందుకు రాష్ట్ర వైద్యబృందం ఏర్పాటు
- ఐసీయూని పరిశీలించి వివరాలు సేకరించిన బృందం సభ్యులు

ఎలుకలు తెచ్చిన తంటా!



ఐసీయూని పరిశీలిస్తున్న వైద్యుల బృందం

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి12: కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగిని ఎలుకలు గాయపర్చిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై ఆదివారం సాయంత్రం ముగ్గురు వైద్య సిబ్బందిపై వేటు వేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయం తీసుకుంది. అలాగే ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలెక్టర్‌కు సరెండర్ చేస్తూ విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే ఎలుకలు దాడి చేస్తే వైద్యులను సస్పెండ్ చేయడం ఎంటని ప్రశ్నిస్తూ టీటీజీడీఏ (తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్) సోమవారం ఆసుపత్రి వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టింది. నర్సింగ్ స్టాఫ్ సైతం అకారణంగా ఓ నర్సును సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని నిరసన తెలిపారు. శానిటేషన్ లోపాలుంటే వైద్య సిబ్బందిని బాధ్యులు చేయడం ఏంటని ప్రశ్నించారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని, లేనిపక్షంలో విడతల వారీగా నిరసనలు వ్యక్తం చేయడంతోపాటు విధులను సైతం బంద్ చేస్తామని టీటీజీడీఏ సభ్యులు హెచ్చరించారు. అయితే ఐసీయూలో జరిగిన ఘటనపై తమ నిర్లక్ష్యం ఏమీ లేదంటూ శానిటేషన్ ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. నిత్యం శానిటేషన్ పనులు చేపడుతున్న తమకు ఏనాడూ ఐసీయూలో పనిచేసే సిబ్బంది ఎలుకలు సంచరిస్తున్న విషయాన్ని తమ దృష్టికి తేలేదనే వాదనలు వినిపిస్తున్నారు.

వైద్యుల విధులు ఎలుకలు పట్టమా?

తమ సేవలు ఎలుకలను పట్టడానికా.. రోగులకు సేవలు అందించడానికి అంటూ టీటీజీడీఏ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం ఆసుపత్రి వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీటీజీడీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలగం తిరుపతిరావు మాట్లాడుతూ విద్యార్థులకు టీచింగ్ విషయంలో ఏవైనా లోపాలు జరిగితే నోటీసులు ఇవ్వడమో లేదంటే చర్యలు తీసుకోవడమో ఉండాలే తప్ప ఎలుకలు పేషెంట్‌పై దాడి చేస్తే వైద్యులపై చర్యలు తీసుకోవడం తొందరపాటు చర్యగా భావిస్తున్నామన్నారు. ఆసుపత్రిలో శానిటేషన్ విభాగం అనేది ఒకటి ఉందని, ఆ విభాగం చేయాల్సిన పనులలో లోపాలు ఉంటే తమను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకోవడం విడ్డురంగా ఉందని అన్నారు. వైద్యుల సస్పెన్షన్ ఎత్తివేయకుంటే మంగళవారం డీఎంఈ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అవసరమైతే విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. అనంతరం నర్సింగ్ స్టాఫ్ సైతం నిరసన తెలిపారు. ఎలుకలు చేసిన పనులకు అనవసరంగా నర్స్‌ను బాధ్యురాలిని చేయడం ఏంటని ప్రశ్నించారు. రోగికి ప్రభుత్వం నర్స్ సస్పెన్షన్‌పై తగిన నిర్ణయం తీసుకుని ఆమెకు న్యాయంచేయాలని కోరారు.

ఐసీయూని పరిశీలించిన వైద్య బృందం

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగిని ఎలుకలు గాయపర్చిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్ అనిల్‌తోపాటు మరో ఇద్దరు వైద్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసింది. సోమవారం ఆ బృందం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి ఐసీయూలో ముజీబ్‌ను ఎలుకలు గాయపర్చిన ఘటనపై ఆరా తీశారు. ఎలుకల దాడిలో గాయపడిన ముజీబ్ కుటుంబీకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అదే విధంగా ఆ రోజు విధుల్లో ఉన్న అటెండర్ నుంచి వైద్యుల వరకు అందరి చెప్పిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఆదివారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆసుపత్రిలో డిస్మెంటల్ చేస్తున్న డయాలసిస్ విభాగాన్ని పరిశీలించడంతోపాటు ఎలుకలు వస్తున్న పలు మార్గాలను పరిశీలించారు. ఎలుకల నివారణకు గతంలో శానిటేషన్ ఏజెన్సీ చేపట్టిన పనులను, ఎలుకల సంచారం ఉన్నప్పుడు శానిటేషన్ సిబ్బందికి ఏ విధంగా కమ్యూనల్ ఇన్ఫార్మేషన్ ఇచ్చారనేది విధుల్లో ఉన్న సిబ్బందిని ఆరా తీశారు. ప్రతీఒక్కరి నుంచి రాతపూర్వక నివేదికను తీసుకుని ప్రభుత్వానికి అందిస్తామని బృందం సభ్యులు తెలిపారు. శానిటేషన్ విభాగానికి చెందిన ఏజెన్సీ నిర్వాహకులు తాము ఐసీయూలో శుభ్రత పనులను మాత్రమే చేస్తామని, ఎలుకల నివారణకు తాము ప్యాడ్‌లను సైతం ఎప్పటికప్పుడు ఏర్పాటుచేస్తున్నామని చెప్పుకొచ్చారు. అందులో మరో ఏజెన్సీకి సంబంధించిన సిబ్బంది సైతం పనులు చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఎలుకలు, ఇతర శానిటేషన్‌కు సంబంధించి సమస్యలు ఉంటే తమకు కమ్యూనల్ కంప్లైంట్ ద్వారా తెలియజేస్తే సమస్యను పరిష్కరించేందుకు వీలుగా ఉండేదని తెలిపారు. అయితే ఐసీయూలోనే ఒక్కరిద్దరు పేషంట్ కేర్‌టేకర్‌లను సైతం గత నాలుగురోజుల కిందట ఎలుకలు కరవడంతో వారు సైతం ఆసుపత్రిలోని ట్రిట్‌మెంట్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలోనే ఎలుకల నివారణకు తగిన చర్యలు తీసుకుంటే ఇంతవరకు వచ్చేది కాదని ఐసీయూలో పనిచేసే పలువురు కిందిస్థాయి సిబ్బంది విధులలో అలసత్వం వహించినట్లు ఆసుపత్రిలోని వర్గాలు పేర్కొనడం గమనార్హం.




నిరసన తెలుపుతున్న టీటీజీడీఏ సభ్యులు



నిరసన తెలుపుతున్న నర్సింగ్ స్టాఫ్





ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని పడకల్ గ్రామంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఆలయంలో భక్తులు యాజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం, బుధవారం స్వామివారి కల్యాణం, సాయంత్రం రథోత్సవం జరగనుందని ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు తెలిపారు. భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



యజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



బాగేపల్లిలో మొరాన్ని ట్రాక్టర్‌లలో తరలిస్తున్న దృశ్యం

యథేచ్ఛగా మొరం అక్రమ రవాణా

రెంజల్, ఫిబ్రవరి 12: ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా యథేచ్ఛగా మొరం తరలిస్తూ.. అక్రమార్జనే ధ్యేయంగా మొరం రవాణాను బాగేపల్లి గ్రామంలో చేపడుతున్నారు. ప్రభుత్వం ద్వారా ఎటువంటి అనుమతి లేకుండా మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా మొరం దందాను సాగిస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లలో మొరం తరలిస్తు అక్రమార్జనకు పాల్పడుతున్న మొరం రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని వాపోతున్నారు. ప్రభుత్వం నిర్మించిన అలీసాగర్ ప్రాజెక్టు వద్ద అక్రమంగా జేసీబీల సహాయంతో మొరాన్ని తవ్వుతూ ఇతర గ్రామాలకు తరలిస్తున్నారని మొరం తరలింపుపై అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.













బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

ఖిల్లా, ఫిబ్రవరి 12: నగరంలోని ఐదో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేసినట్లు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగేనవార్ తెలిపారు. ఖచ్చిత మైన సమాచారం మేరకు భారతీ రాణి కాలనీలో నివాసం ఉంటున్న షేక్ ముజీబ్,నజీబ్‌అహ్మద్‌ల ఇంటిపై టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చే శారన్నారు.ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి ముజీబ్‌ను అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి రూ.46700ల నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. వీరు మహారాష్ట్రలో భారీ ఎత్తున అమాయక ప్రజలను మోసగించి ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరు గతకొంత కాలంగా బెట్టిం గ్ నిర్వహిస్తున్నట్లు వస్తున్న ఆరోపణ నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్, ఇన్స్‌పెక్టర్లు అజయ్ బాబు, అంజయ్య, ఐదవటౌన్ ఎస్ఐ అప్పరావ్,సిబ్బంది దాడి చేశారన్నారు. మిగతా ఐదుగురు పరారీలో ఉన్నారన్నారు.


పోలీసుల అదుపులో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తులు

వృద్ధుల వద్ద డబ్బులను కాజేస్తున్న వారికి దేహశుద్ధి

నవీపేట,ఫిబ్రవరి12: మండలంలోని అబ్బాపూర్(ఎం), జగ్గారావు ఫారం మధ్యన సోమవారం వృద్ధుల నుండి డబ్బులను కాసేస్తున్న ముగ్గురికి యువకులు దేహశుద్ధి చేశారు. నిజామాబాద్ ఆటో నగర్‌కు చెందిన ఇద్దరు, అర్సపల్లికి చెందిన మరొకరు కలిసి ఆటోలో తిరుగుతూ ఒంటరిగా ఉన్న వృద్ధులను తమ ఆటోలో ఎక్కించుకుని ఊరి బయట వారి నుంచి డబ్బులను లాక్కుంటున్న ముగ్గురిని యువకులు దేహశుద్ధి చేశారు. బస్టాండ్, ఆటో స్టాండ్‌ల వద్ద ఒంటరిగా ఉంటున్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని వారి తమ ఆటోలలో ఎక్కించుకుని తమ గ్రామంలో దించుతామని నమ్మబలికి ఊరి బయట వారి వద్ద డబ్బులను లాక్కుంటున్నట్లు సమాచారం రావడంతో నవీపేట, ఫత్తేనగర్‌కు చెందిన పలువురు యువకులు ఆటోను వెంబడించి సంబంధిత ముగ్గురు వ్యక్తులను యువకులు చితకబాది వదిలేశారు.

నవీపేట సీహెచ్‌సీ స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

● నవీపేట మండల సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు ● ప్రభుత్వ ఆసుపత్రి కబ్జా అంశాల ప్రస్తావన

నవీపేట,ఫిబ్రవరి12: నవీపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చెందిన కొంత స్థలం ఇటీవల కబ్జాకు గురైందని సంబంధిత స్థలం కబ్జా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నవీపేట మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. సోమవారం ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆసుపత్రికి సంబంధించిన కొంత స్థలం కబ్జాకు గురవుతుందని పలువురు సభ్యులు సభ దృష్టికి తేగా ఈ తీర్మానం ఆమోదించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఎంపీటీసీలు మీనా, కృష్ణ మోహన్‌రావు, మండల కోఆప్షన్ సభ్యులు అల్తాఫోద్దీన్ అన్నారు. బినోల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని నియమించాలని సభ్యులు కోరారు. 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించిన డాటా ఎంట్రీ చేపట్టడానికి గ్రామాలలో ఎక్కువ సిబ్బందిని నియమించాలని నవీపేట ఎంపీటీసీ సతీష్ కోరారు. నిజాంపూర్ నుండి నాళేశ్వర్ వరకు రూ.6కోట్లలతో చేపట్టి రోడ్డు విస్తరణ పనులలో భాగంగా ఐదున్నర మీటర్ల బీటీ రోడ్డు కాకుండా 7మీటర్ల బీటీ రోడ్డును వేయాలని నిజాంపూర్ ఎంపీటీసీ కృష్ణ మోహన్ రావు, నాళేశ్వర్ ఎంపీటీసీ శ్యామల కోరారు. అభంగపట్నం నుంచి నవీపేట వరకు ఉన్న ప్రధాన రహదారిపై స్కూల్ జోన్‌లలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ మీనా కోరారు. అబ్బాపూర్(ఎం) వద్ద సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదని ఎంపీటీసీ సాయిలు అన్నారు. ఈ సందర్భంగా నవీపేట నుంచి కామారెడ్డి జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, జడ్పీటీసీ సవిత, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తహసీల్దార్ దన్‌వాల్, ఎంపీవో రామకృష్ణ తదితరులున్నారు.


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంగెం శ్రీనివాస్

ట్రాన్స్‌జెండర్లపై వస్తున్న పుకార్లను నమ్మొద్దు


మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్ శ్యామల

పెద్దబజార్, ఫిబ్రవరి 12:ట్రాన్స్‌జెండర్లు కిడ్నాపర్లుగా తమను ఇబ్బందికి గురి చేస్తున్నారని, ట్రాన్స్‌జెండర్ శ్యామల, రక్ష జరీనాలు అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్నపిల్లలను ఎత్తుకెళ్తున్నామని సోషల్‌మడియాలో వస్తున్న పుకార్లలో వాస్తవాలు లేవని అన్నారు. సమాజంలో తాము కూడా మనుషులమేనని మమ్ములను గుర్తించాలని కోరారు. గత 15రోజులుగా ఎక్కడికి వెళ్లిన తమను కిడ్నాపర్లుగా భావిస్తున్నారని అన్నారు.తాము పొట్టకూటి కోసం బిక్షాటనచేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. తాము పెద్దలకు, పిల్లలకు ఆశీర్వాదాలు ఇస్తామే తప్ప వారికి ఎలాంటి హానికలిగించం అని అన్నారు.ఈవిలేకరుల సమావేశంలో ఆరతి, గంగా, ప్రియ, ప్రజ్ఞ, అలకనందతో పాటు 60మంది ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో వైభోపేతంగా ధ్వజారోహనం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని బర్దిపూర్ హరిహర క్షేత్ర ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురష్కరించుకొని ఆలయ వేద బ్రహ్మణులు సోమవారం మంగల వాయిద్యాలతో ధ్వజారోహన కార్యక్రమాన్ని వైభోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, సుప్రభాత సేవ, నవగ్రహ హోమం, వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్బంగా భక్తులు హరిహర క్షేత్రంలో ప్రత్యేక హోమంలో పాలుపంచుకున్నారు. నేడు ఆలయ ప్రాంగణంలో సుదర్శన హోమం, ఉత్సవ విగ్రహల ఊరేగింపు ఉంటొందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.


బర్దిపూర్ ధ్వజరాహోనం దృశ్యం

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్షపుష్పార్చన

కమ్మర్‌పల్లి,ఫిబ్రవరి 12: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి మాతఆలయంలో సోమవారం ఆలయ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కమ్మర్‌పల్లి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రం శివారులోని శ్రీగిరిక్షేత్రము జంబి హనుమాన్ ఆలయం పక్కనే నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో సోమవారం వామనాశ్రమ మహాస్వామిజీ లక్షపుష్పార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు ఆమెడ (డిష్) నరేందర్, దొంతుల రమణయ్య, జొన్నల భూషన్, జొన్నల పూర్ణ ప్రసాద్, చిటికేశి రఘు, ఆమేటి శంకర్, నీలి వేణుగోపాల్, సంఘసభ్యులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపులో విద్యారంగంపై చిన్నచూపు

పెర్కిట్, ఫిబ్రవరి12: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యరంగానికి 7.75శాతంలో రూ.21వేల 389కోట్లు కేటాయించడం విద్యా రంగం పైన చిన్నచూపు అని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాలయ ఝాన్సీ అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యరంగానికి ప్రాధాన్యత ఇవ్వకుండా బడ్జెట్ కేటాయింపులో అతితక్కువ బడ్జెట్ కేటాయించిన కారణంగా విద్యారంగం నిర్వీర్యమైందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరాశ మిగిల్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి బడ్జెట్‌లో 30శాతం నిధులు విద్యరంగానికి కేటాయించాలని అన్నారు., లేదంటే గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా విద్యార్థుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ఏబీవీపీ హెచ్చరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సునీల్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సాయి, దుర్గాదాస్, ఆర్మూర్ డివిజన్ ఇన్‌చార్జీ గొడుగు వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధులగుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, ఫిబ్రవరి12: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శివాలయంలోని సిద్దేశ్వరునికి ప్రత్యేక పూజలు, పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. గుట్టపై గల శివాలయంలో రామాయలంలో, దత్తాత్రేయ, అయ్యప్పస్వామి, దుర్గామాత ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద హనుమాన్ ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ భజన మండలి సభ్యులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. గుట్టపై ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, బీసీ.గంగారెడ్డి, గంగ కిషన్, బోండ్ల ఆనంద్, కోడిగెల మల్లయ్య, నక్కల లక్ష్మణ్, మీనచంద్, అయ్యప్ప శ్రీనివాస్, చిన్నారెడ్డి, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు టీకాలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి12: పట్టణంలోని వెంటర్నరీ ఆసుపత్రిలో సోమవారం పశువులకు గొంతు వాపు టీకాలను వెంటర్నీ అసిస్టెంట్ రోజా టీకాలను వేశారు. పట్టణంలో గల 146పశువులకు గొంతువాపు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలను వేయడం జరిగిందని, అలాగే రైతుల విజ్ఞప్తి మేరకు ఉదయం 8గంటలకు ఆసుపత్రి తెరిచి ఉంటుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ముప్కాల్, ఫిబ్రవరి12: అండర్-16 విభాగంలో బాలబాలికల కబడ్డీ క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు పీడీ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలోని చైతన్య క్రీడా మైదానంలో నిజామాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు క్రీడలు నిర్వహించి ఎంపిక చేశారు. ఈనెల 16నుంచి 19వ తేదీ వరకు సూర్యపేట జిల్లాలో ఎంపిక చేసిన క్రీడాకారులు నిజామాబాద్ జట్టు తరఫున రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచే విధంగా రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.గంగాధర్, సాయన్న, రిటైర్డు ఉపాధ్యాయుడు అంజయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


గంగాదాస్ (ఫైల్). లక్ష్మణ్ (ఫైల్)

ఇందల్‌వాయి, ఫిబ్రవరి12 : బంధువులను పరామర్శించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తూ పరలోకానికి వెళ్లిన ఘటన ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... పోలీసు స్టేషన్ పరిధిలోని అన్సాన్‌పల్లి గ్రామ శివారులో ఎదరెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు అతివేగంగా ఉండి అదుపు తప్పడంతో బలంగా ఢీకొనడంతో నల్లవెల్లి గ్రామానికి చెందిన సీరడి గంగాదాస్(42) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు.ఈ ఘటనలో రెండు ద్విచక్రవాహనాలు నుజ్జునుజ్జుఅయినట్లు పోలీసులు తెలిపారు. నందిపేట మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన లక్ష్మణ్ (23)ను ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు,మరో వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయన్నారు. నల్లవెల్లి గ్రామానికి చెందిన గంగాదాస్ తన ద్విచక్రవాహనంపై ధర్పల్లి మండలంలోని సీతాయిపేట్ గ్రామంలోని తన బంధువులను పరామర్శించేందుకు వెళ్తూ అన్సాన్‌పల్లి వద్ద ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. మృతుడికి భార్య సాయవ్వ, ఒక కుమారుడు ఉన్నారని మృతుని భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్, గోపు బాలరాజు తమ ద్విచక్రవాహనంపై ధర్పల్లి వెళ్తుండగా అన్సాన్‌పల్లి శివారులో రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీ కొన్నారని, ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం గోపుబాలరాజు పరిస్థితి విషమంగా ఉండగా శ్రీనివాస్ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి

● మోకన్‌పల్లి చెరువులో కాళ్లు, చేతులు కట్టి పడి ఉన్న మృతదేహం లభ్యం
● సంఘటన స్థలాన్ని పరిశీలించిన నిజామాబాద్ ఏసీపీ, నార్త్ రూరల్ ఇన్‌చార్జి సీఐ, ఎస్ఐలు
● హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ

నవీపేట,ఫిబ్రవరి12: మండలంలోని మోకన్‌పల్లికి చెందిన రొడ్డ నరేష్(30)అనే ఆటో డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మోకన్‌పల్లికి చెందిన రొడ్డ నరేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 10సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన దివ్యను నరేష్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 9సంవత్సరాల విఘ్నేష్, 7సంవత్సరాల రుత్విక్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 10న భార్య, పిల్లలతో కలిసి ఆటోలో ఎడపల్లి మండలం జానకంపేట లక్ష్మి నరసింహ స్వామి ఆలయానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కమలాపూర్ సమీపంలో తన భార్య కోరిక మేరకు దివ్య ఆటోను నడుపుతుండగా కొద్ది దూరంలోనే ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దివ్యతో పాటు ఇద్దరు కుమారులకు స్వల్ప గాయాలు కాగా వారికి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈ విషయంపై నరేష్‌కు అతని అత్తగారింటి వారితో చిన్నపాటి గొడవ జరిగినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ నెల 10న బయటకు వెళ్లిన నరేష్ రాత్రికి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. 11వ తేది ఆదివారం రాత్రి నరేష్ అదృశ్యం అయినట్లు నవీపేట పోలీస్ స్టేషన్‌లో అతని తల్లి అబ్బవ్వ ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం స్థానిక గుర్రం చెరువులో నరేష్ మృతదేహం లభ్యమైంది. మృతదేహన్ని చెరువులో నుండి బయటకు తీయగా అతడి రెండు కాళ్లకు ప్లాస్టిక్ వైర్‌తో కట్టి ఉండగా చేతులకు చిన్నపాటి టవల్‌తో కట్టి ఉన్నాయి. సంఘటన స్థలాన్ని నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్, నార్త్ రూరల్ ఇన్‌చార్జి సీఐ సురేష్, ఎస్ఐ యాదగిరి గౌడ్‌లు పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరేష్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కాళ్లు, చేతులు కట్టి వేసి చెరువులో పడేసి హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. కేసును అన్ని కోణాల్లో విచారించి న్యాయం చేస్తామని పోలీసులు బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. పోస్టుమార్టంకు తరలించిన నరేష్ మృతదేహన్ని ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి చైతన్య రెడ్డి పరిశీలించారు.


రొడ్డ నరేష్(ఫైల్)

కేంద్ర పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలి

పెద్దబజార్, ఫిబ్రవరి 12:అర్హులైన ప్రతీ ఒక్కరు కేంద్ర పథకాలపై అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. నగరంలోని గాయత్రినగర్‌లో సోమవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర-2 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తేవడం జరిగిందన్నారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలని అకుంటిత దీక్షతో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే వీటిని చాల మంది వినియోగించుకుని లబ్ధిపొందుతున్నారని తెలిపారు. ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వారిచే సభలో వారి అనుభవాలను అనుభూతులను స్వయంగా వర్ణించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలను అందుతాయని అందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించుకోవాలని సూచించారు. ఆయుష్మాన్‌భారత్ పీఎం.జేఏవై, పీఎం.ఉజ్వల, పీఎం.పోషణ అభియాన్, జన్‌ధన్ అభియాన్, జీవనజ్యోతి, భీమాయోజన, సురక్షభీమయోజన,అటల్‌పింఛన్ యోజన, ముద్రయోజన తదితర పథకాల గురించి సంబంధిత శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సంక్షేమ పథకాల సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలు, గోడపత్రాలు, క్యాలెండరును ఆవిష్కరించారు.అంతకు ముందు పీఎం ఉజ్వల స్కీమ్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి గ్యాస్ కనెక్షన్‌తో పాటు మంజూరి లేఖలను, సిలిండర్లను లబ్ధిదారులకు అర్వింద్ అందించారు. ఈకార్యక్రమంలో సీబీసీ.ఎఫ్.పీవో. ధర్మనాయక్, లీడ్‌బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌రావ్, మున్సిపల్ మేనేజర్ రమేష్, ఇన్సూరెన్సు సీనియర్ డివిజనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, శివచరణ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు,తదితరలు, పాల్గొన్నారు.

సుర్బిర్యాల్‌లో ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి12: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబ్బ రాజేశ్వర్ స్మారక జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. టోర్నమెంట్‌లో మొత్తం 32జట్లు పాల్గొనగా ఫైనల్‌లో సుర్బిర్యాల్, కొత్తపల్లి జట్లు తలపడ్డాయి.హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో సుర్బిర్యాల్ జట్టు విజయం సాధించింది. కొత్తపల్లి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంతం క్రీడలకు పుట్టినిళ్లు లాంటిదన్నారు. యువకులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫత్తేపూర్ సొసైటీ ఛైర్మన్ గడ్డం శ్రావణ్‌రెడ్డి, జిల్లాకబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌దాస్, టోర్నీ నిర్వాహకులు అబ్బ దిలీప్, రాకేష్, సంకేపల్లి గంగాధర్, నగేష్, మునిరాజ, గడ్డి చిన్నయ్య, జె.రాజేశ్వర్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అన్వేష్‌రెడ్డి

సాటాపూర్ అంగడి బజార్‌లో షెడ్ల ప్రారంభం

రెంజల్,ఫిబ్రవరి12: మండలంలోని సాటాపూర్ గ్రామంలోని అంగడి బజార్‌లో నాబార్డు నిధులు రూ.16.69లక్షల వ్యయంతో నిర్మించిన అంగడి బజార్ కార్యాలయం, షెడ్లు, మూత్రశాలలను సోమవారం నాబార్డు జనరల్ మేనేజర్ చింతల సుశీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలోనే అతి పెద్ద మార్కెట్ అయిన సాటాపూర్ అంగడి బజార్‌లో నాబార్డు నిధుల ద్వారా వ్యాపారుల సౌకర్యార్థం కోసం షెడ్లు, మూత్రశాలలు, కార్యాలయాన్ని నిర్మించి ప్రారంభించడం జరిగిందని అన్నారు. గత వంద సంవత్సరాల నుంచి నడుస్తున్న మార్కెట్ మరింత మెరుగుపడేందుకు మరి కొన్ని షెడ్లను వ్యాపారస్తుల సౌకర్యార్థం నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేక విజయ సంతోష్, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ, మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, తాజా, వికార్ పాషా, జావీదోద్దీన్, సాయిలు,సంతోష్, కాంట్రాక్టర్ సింహరాయులు తదితరులున్నారు.


అంగడి బజార్ షెడ్లను ప్రారంభిస్తున్న నాబార్డు జనరల్ మేనేజర్ చింతల సుశీల

సాఫీగా సాగుతున్న వాహనదారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మాధవనగర్‌లో ఆర్‌యూబీ కింద నిలిచిన నీటిని తొలగించిన దృశ్యం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 12: న త్తనడకన మాధవనగర్ ఆర్వోబీ పనులు అనే వార్త ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు.మాధవనగర్ శివారులో గల ఆర్‌యూబీ కింద నిలిచిన కలుషిత నీటిని సిబ్బందిని తొలగించారు. దీంతో వాహనరాకపోకాలు సాఫీగా జరుగుతున్నాయి. దీంతో యాజమన్యానికి ప్రయాణికులు ధన్యవాదలు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 12: కర్షకులు, కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరీని నిరసిస్తూ ఈనెల 16న కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని టీఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యదర్శి కోహెడ నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం దేశవ్యాప్త పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను ఎన్ఈపి చట్టం, విద్యుత్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి కనీస వేతన చట్టం అమలు పర్చి 26వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబికసత్యానారయణ, కల్లెడ గంగన్న, బొబ్బ నర్సింగ్‌రావ్, శంకర్, లవంగరాజు, నర్సయ్య, సర్వరాజ్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పదో వార్షికోత్సవం

మెండోర, ఫిబ్రవరి12: మండల కేంద్రంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం పదవ వార్షికోత్సవాలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్బంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారి గోవిందా నామాల శంకు చక్రలను ప్రతిష్ఠాపన చేశారు. ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలు ఈనెల 15వ తేదీ వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఊరేగించి ప్రతిష్ఠాపన చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. నేడు ధ్వజరోహణం, దేవత ఆహ్వానం, రాత్రికి స్వామివారి ఎదుర్కోలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన 27మంది కోర్టులో హాజరు

●26మందికి రూ.29వేలు జరిమాన ● ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష

ఖిల్లా, ఫిబ్రవరి 12: మద్యం తాగి వాహనం నడిపిన 27మందిని కోర్టు ఎదుట హాజరు పర్చగా 26మందికి రూ.29వేల100లు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారయణ తెలిపారు. ఇందులో ఒకరికి నాలుగు రోజు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. శిక్ష విధించిన వ్యక్తిని కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుప వద్దని ఆయన హెచ్చరించారు.

అనుమానితులను పోలీసులకు అప్పగింత

ఆర్మూర్‌టౌన్ , ఫిబ్రవరి12: ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం అనుమా నాస్పందంగా తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. మండల కేంద్రంలో కృష్ణ జిల్లాకు చెందిన నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని కిడ్నాపర్‌లుగా భావించి వివరాలు అడగగా సరియైన సమాధానం రాకపోవడంతో గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందిం చారు. దీంతో ఐదుగురిని అదుపులోకి తీసుకొనిపోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదావరి నదిలో పడి వ్యక్తి ఆత్మహత్య

రెంజల్,ఫిబ్రవరి12: మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాకసిపేట్ గ్రామానికి చెందిన కలీముల్లా(33)అనే వ్యక్తి రియల్ ఏస్టేట్ వ్యాపారం చేసి నష్టపోవడంతో గత సంవత్సరం నుంచి అప్పులు ఇచ్చే వారికి అప్పులు చెల్లించలేక అప్పులు బాధ తాళలేక జీవితంపై విరక్తి చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వెళ్లిపోయి సాయంత్రం సమయంలో ఫోన్ చేయగా గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ లేపి కందకుర్తి బ్రిడ్జి వద్ద నీళ్లలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడని చెప్పడంతో కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకోవడం జరిగిందని ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. కుటుంబీకుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని జాలర్ల సహయంతో మృతదేహన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సమ్రీన్ సుల్తానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

కబ్జాలపై అధికారుల్లో కదలిక

● 1333సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి పరిశీలన

ముప్కాల్, ఫిబ్రవరి12: బాల్కొండ మండల కేంద్రంలో సర్వేనెంబర్ 1333లో గల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురికావడంపై సోమవారం అధికారులు కదలిక మొదలైంది. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే ల్యాండ్ గందం వెంకటేశ్వర్‌ల బృందం ఆధ్వర్యంలో నలుగురు సర్వేయర్ల బృందం 1333 సర్వేనెంబర్‌లో గల భూమిని క్షేత్రస్థాయిలో పర్యటించి మోకాలిపై పరిస్థితిని ఏమిటో తనిఖీ చేశారు. అయా భూముల్లో నిర్మాణాలు ఏమున్నాయి, ఖాళీ స్థలం ఎంత, తదితర వివరాలపై ఆరా తీశారు. 1333సర్వే నెంబర్‌లో 224ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. అంతేగాకుండా తుది నివేదికను జిల్లా కలెక్టర్ సమర్పిస్తామన్నారు. ఆయన వెంట సర్వేయర్లు కిషన్‌నాయక్, సూర్యప్రకాష్, మమత, ఆర్ఐ రాఘవేంధర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పాఠశాల ఉపాధ్యాయులు

'పదోన్నతులు, బదిలీల తర్వాతే కొత్త నియామకాలు చేపట్టాలి'

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి12: గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు గత ఐదేళ్లుగా బదిలీలు, ప్రమోషన్లు, జీవో317 అమలుగాక అనేక ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేశారు. సీనియర్లకు ప్రమోషన్ ఇవ్వకుండా, జీవో317 అమలు చేయకుండా ఈనెల 14న నూతన నియామకాలను ఉత్తర్వులు ఇవ్వటానికి సిద్ధపడినట్లు తెలిసిందని, దీంతో 10వేల మంది సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతారని వెల్లడించారు. ఐదేళ్లుగా దూరప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నిరాశకు లోనవుతున్నారని, సాంఘిక సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గురుకులాల జాక్ (జేఏసీ) పిలుపు మేరకు విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినట్లు చెప్పారు.

● పెద్ద కొడప్‌గల్‌లో..

గురుకుల పాఠశాలల్లో బదిలీలు చేపట్టిన తర్వాతే నియామకాలు చేపట్టాలని పెద్దకొడప్‌గల్ బాలికల గురుకుల పాఠశాల సిబ్బంది పాఠశాల ఎదుట నల్లబ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా తాము పాఠశాల ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టామని తెలిపారు. పాఠశాలల్లో నూతనంగా నియామకాలు చేపడుతున్నారని ఇలా చేయడం వలన తమకు ఇబ్బంది అవుతుందని, బదిలీలు చేసిన తర్వాత నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రంజిత, చైతన, మీనాక్షి, విజయలక్ష్మి, రజిత, వాసవి, శివ, చాంద్‌పాష పాల్గొన్నారు.

● భిక్కనూరులో..

భిక్కనూర్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు భిక్కనూర్ మండలంలోని సిద్ధరామేశ్వర్‌నగర్ గ్రామం వద్ద గల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం నిరసన చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పాఠశాల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు


పోలీసుల అదుపులో నిందితుడు

నాటు బాంబులు, తుపాకుల స్వాధీనం

గాంధారి, ఫిబ్రవరి12: మండలంలోని రాంపూర్‌లో నిషేధిత నాటుబాంబులు, నాటుతుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రాంపూర్ గడ్డకు చెందిన వల్లెపు హనుమంతు అడవి జంతువులను వేటాడుతున్నాడనే సమాచారంతో పోలీసులు వీరిని గాలించారు. అటవీశాఖ అధికారులు రాంపూర్‌గడ్డ శివారులో సోదాలు జరుపుతుండగా వల్లెపు హనుమంతు, వడ్డె హనుమంతులు అధికారులను చూసి పారిపోయినట్లు తెలిపారు. హనుమంతు ఇంట్లో సోదాలు జరపగా, రెండు నాటు తుపాకీలు, 15 నాటుబాంబులు దొరకడంతో అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదుచేశారని తెలిపారు. కేసునమోదు చేసుకుని హనుమంతుని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

● మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు: ఎస్సై

మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని గాంధారి ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రోడ్డు నిమయ నిబంధనలు పాటించకపోవడంతో చాలా మంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ధరించాలని, లైసెన్స్, ఆర్సీ వెంటఉంచాలన్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నాగమడుగు ఎత్తిపోతలను పరిశీలించిన ఆర్‌డీవో

నిజాంసాగర్, ఫిబ్రవరి 12: మంజీర నదిపై నిర్మితమవుతున్న నాగమడుగు ఎత్తిపోతల పథక నిర్మాణాన్ని సోమవారం బాన్సువాడ ఆర్‌డీవో భుజంగరావు పరిశీలించారు. ఎత్తిపోతల పథకం నిర్మాణ దశలోనే నిర్మాణంలో రాళ్లు తేలడంతో వాటిని బ్లాస్టింగ్ ద్వారా తొలగించాలని కాంట్రాక్టర్ అధికారులకు సూచించారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో ఏ దశలో రాళ్లు ఉన్నాయని ఇంజనీర్లను ఆర్‌డీవో అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో ఉన్న రాళ్లను బ్లాస్టింగ్ ద్వారా తొలగించాలని ఆదేశించారు. మంజీర నదిలో బ్లాస్టింగ్ ద్వారా తొలగించేందుకు అనుమతుల కోసం ఉన్నతాధికారులకు సిఫారస్ చేయనున్నట్లు తెలిపారు.పనులు వేగిరంగా కొనసాగుతున్నాయని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సులేమన్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ పనుల వద్ద కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఆర్‌డీవో




దోమకొండలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


మద్నూర్‌లో మార్కండేయుని బారసాల నిర్వహిస్తున్న మహిళలు


ఎల్లారెడ్డిలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఘనంగా మార్కండేయ జయంతి

దోమకొండ, ఫిబ్రవరి12: మండల కేంద్రంలో మార్కండేయ జయంతి ఉత్సవాలను సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీఉమామహేశ్వరుల, సీతారాముల కల్యాణోత్సవం, నవగ్రహ వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో పూజలు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉమామహేశ్వరుల, సీతారామ చంద్రస్వామి మార్కండేయ స్వామి ఊరేగింపు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● బీబీపేటలో..

బీబీపేట: మండల కేంద్రంలో భక్తమార్కండేయ జయంతి ఉత్సవాలను పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఉత్సవాలలో భాగంగా కలశయాత్రా, జలభిషేకం, నవగ్రహ పూజ, మహయజ్ఞం, భజన కార్యక్రమాలు నిర్వహించనట్టు పద్మశాలి సంఘం అధ్యక్షుడు నరేందర్‌తెలిపారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు మచ్చేందర్, శ్రీహరి, సందీప్, బాలశేఖర్, పురుషోత్తం, బాల్‌రాజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● మద్నూర్‌లో..

మద్నూర్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో సోమవారం మార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ సాయిలు, మందిరం అధ్యక్షుడు బద్దవార్ లక్ష్మ ణ్‌సేట్, ఎంపీటీసీ సంగీత కుషాల్, ప్రత్యేక అధికారి విజయ్ పాల్గొన్నారు.


భజనలు చేస్తున్న కళాకారులు

● బాన్సువాడలో..

బాన్సువాడ: భక్తమార్కండేయ జయంతి వేడుకలను పురస్కరించుకుని బాన్సువాడ పట్టణంలోని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మార్కండేయ జయంతి వేడుకల్లో ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ బాస్కర్‌రెడ్డిపాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ గంగాధర్,ఆలయ కమిటి అధ్యక్షుడు కాశీనాథ్, గూడ శ్రీనివాస్, నరహరి, రామచందర్, సాయిలు, బాలకృష్ణ, వెంకటరామిరెడ్డి, మోహన్‌నాయక్, ఏజాజ్, అంజిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● బీర్కూర్‌లో..

బీర్కూర్: మండల కేంద్రంలో సోమవారం మార్కండేయ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలుచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ నర్సింలు, సెక్రటరీ విజయ్, కోశాధికారి నాగరాజు, శ్రీకాంత్, నవీన్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

● రాజంపేటలో..

రాజంపేట: మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో సోమవారం మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలశాలలతో మహిళలు పెద్దఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో గణపతిపూజ, ధ్వజారోహణ హోమం, పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి బాల్‌చంద్రం, కోశాధికారి రవీందర్‌సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని లింగారెడ్డిపేట్ వార్డులో సోమవారం పద్మశాలీ సంఘం సభ్యులు ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు. పెద్దఎత్తున పాల్గొని అభిషేకాలు, కుంకుమార్చన, ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలి

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 12: తాము అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో చేసిన వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సోమవారం నాగిరెడ్డిపేట మండల మాజీ సర్పంచ్‌లు కామారెడ్డిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల కోసం తాము అప్పులు తీసుకొచ్చి పనులు చేశామని, గ్రామాల అభివృద్ధికి పాటుపడగా, తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ప్రభుత్వం నుంచి మంజూరు కాలేవని తెలిపారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోవడంతో తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు మనోవేదనకు గురవుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా కృషి చేయాలని వినతిపత్రంలో కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపేట మండలం సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు ధారబోయిన కృష్ణ, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, సాయిలు, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డీఈవోకు సమ్మెనోటీసు ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

రేపు బస్వాపూర్ సొసైటీలో ట్రాక్టర్ వేలం

భిక్కనూర్, ఫిబ్రవరి 12: మండలంలోని బస్వాపూర్ సొసైటీలో బుధవారం ట్రాక్టర్ వేలం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని విండో చైర్మన్ కిష్టాగౌడ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విండో పరిధిలోని గుర్జకుంట గ్రామానికి చెందిన కుంటమల్లారెడ్డి విండోలో తీసుకున్న దీర్ఘకాలీక రుణాలను చెల్లించకపోవడంతో విండో పాలకవర్గం తీర్మానం మేరకు అతని ట్రాక్టర్‌ను వేలం వేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగినవారు వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

జడ్పీ సీఈవో, డీఆర్‌డీఓ పీడీల బదిలీ

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 12: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆయా శాఖలలోని అధికారులల బదిలీలు చేపడుతున్నారు. సోమవారం అందుకు సంబంధించిన ఉత్తర్వులను పీఆర్‌అండ్ ఆర్‌డీ ప్రిన్సిపల్ సెక్రటరీ సుల్తానీయా జారీచేశారు. ఇందులో భాగంగా కామారెడ్డి జడ్పీ సీఈవో సాయాగౌడ్ డీఆర్‌డీఓ పీడీగా నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జడ్పీ సీఈవోగా నిజామాబాద్ డీఆర్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న బీ.చందర్‌ను సీఈవోగా నియమించారు. అదేవిధంగా డీఆర్‌డీఓ పీడీ సాయన్న ఆదిలాబాద్ డీఆర్‌డీఓగా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో మెడ్చల్ మల్కజీగిరి నుంచి డీఆర్‌డీఓ పీడీగా పద్మజరాణి బదిలీపై రానున్నారు. అడిషనల్ డీఆర్‌డీఓగా వమన్‌రావు సంగారెడ్డిని నుంచి బదిలీపై రానున్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 12: ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పోగొట్టుకున్న 13 సెల్‌ఫోన్లను బాధితులకు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్ఐ బొజ్జ మహేష్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ నాయక్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గత వారం రోజుల నుంచి ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోను చేయడం జరిగిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్, లింగంపేట్ ఎస్ఐ నాగిరెడ్డి, ఎస్ఐలు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు, నోట్ పుస్తకాల వితరణ

బీర్కూర్, ఫిబ్రవరి 12: పీఆర్‌టీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పీఆర్‌టీయూ మహిళా కార్యదర్శి నాగమణి సోమవారం చించొల్లి పాఠశాలకు ఫ్యాన్లు, అన్నారం పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఆర్‌టీయూ యూనియన్ ఉపాధ్యక్షుల హక్కుల కోసం పోరాటం చేయడమే కాకుండా, సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు సంతోష్‌జెట్టి, నాగరాజు, విఠల్ యాదవ్, రామకృష్ణ, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

దుకాణా సముదాయాలకు వేలం

మాచారెడ్డి, ఫిబ్రవరి 12: మండలంలోని గజ్యానాయక్ చౌరస్తాలోని వీర హనుమాన్ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన 18 దుకాణా సముదాయాలకు 14న వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ప్రభు రాంచంద్రం తెలిపారు. మొత్తం 20 దుకాణాలు ఉండగా ఏడు, పదినంబర్ దుకాణాలు తప్ప మిగిలిన 18 దుకాణాలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వ్యాపారస్థులు వేలంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

దోమకొండ, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని చాముండేశ్వరీ దేవి దేవాలయంలో రాజగోపుర నిర్మాణానికి దోమకొండకు చెందిన అల్లె గీత, రవి దంపతులు రూ.23,011 ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్‌కు అందజేశారు.

బీర్కూర్ ఎస్సైగా రాజశేఖర్

బీర్కూర్, ఫిబ్రవరి 12: బీర్కూర్ ఎస్సైగా రాజశేఖర్ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న రాజశేఖర్ బీర్కూర్‌కు బదిలీపై వచ్చారు. ఇదివరకు ఎస్సైగా విధులు నిర్వర్తించిన నర్సింలు కామారెడ్డికి బదిలీ అయ్యారు.

'సంఘ భవన ప్రారంభోత్సవానికి తరలిరావాలి'

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 12: ఈ నెల18న హైదరాబాద్ కోకాపేట్‌లో ప్రారంభించనున్న రాష్ట్ర కురుమ సంఘ భవన ప్రారం భోత్సవానికి నియోజకవర్గంలోని కురుమలు తరలిరావాలని జుక్కల్ మండల కురుమ సంఘం అధ్యక్షులు ఖండు గొండ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఖండుగొండ విలేకరులతో మాట్లాడుతు ఈ కార్యక్రమానికి రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి, కర్నాటక సిఎం సిద్ది రామయ్య, బండారు దత్తాత్రేయ వంటి ప్రముఖులు రానున్నారని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

సదాశివనగర్, ఫిబ్రవరి 12: గుర్తుతెలియని వాహనం ఢీకొని లోటావత్ బాబు(38) మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన బాబు మూడు నెలల క్రితం చెరుకు కొట్టడానికి వచ్చి మార్కల్ గ్రామంలో భార్యతో పాటు ఉంటున్నాడని తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు చెరుకు బండి షుగర్ ఫ్యాక్టరీలో పెట్టిన తర్వాత తిని వస్తానని వెళ్లాడు. సుమారు రాత్రి 8.30 గంటలకు తన తోటి వ్యక్తికి అన్నం తెస్తానని చెప్పి అడ్లూర్ ఎల్లారెడ్డి వైపు నుంచి వస్తుండగా అడ్లూర్ ఎల్లారెడ్డి బ్రిడ్జి సర్వీస్‌రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడని తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య బూలిబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


వైద్యఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన వైద్యులు

'వాస్తవ పరిస్థితులను మంత్రికి వివరించాం'

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 12: కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన వాస్తవపరిస్థితులను వైద్యఆరోగ్యశాఖమంత్రికి వివరించినట్లు రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌రాజనర్సింహను వైద్యులు కలిశారు. కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణంలో ఉందని,పేషంట్ కుటుంబీకులు భోజనాలు చేయడానికి సరైన స్థలం లేకపోవడంతో అయా విభాగాల వద్దనే భోజనాలు చేయడంతో ఎలుకల ఆయా విభాగాలలోకి వస్తున్నాయని వివరించామని తెలిపారు. అదేవిధంగా గత ప్రభుత్వంలోని పలువురు ఉద్దేశ్య పూర్వకంగా వైరల్ చేయడంతో పరిస్థితి తీవ్రతరంగా మారిందని సీనియర్ వైద్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు వివరించారు. వైద్యుల సస్పెన్షన్‌పై మరోసారి ఆలోచన చేయాలని వాస్తవ పరిస్థితులను వివరించినట్లు కోరామన్నారు. దీంతో వైద్యఆరోగ్యశాఖమంత్రి పూర్తిస్థాయి విచారణ జరిపి వైద్యుల సస్పెన్షన్‌ను రివోక్ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.అలాగే వైద్యవిధానపరిషత్‌లో పలు సమస్యలపై వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యవిధానపరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయంలో లక్ష పుష్పార్చన

రాజంపేట, ఫిబ్రవరి 12: మండలంలోని ఆరేపల్లి గ్రామంలోని శ్రీ కైలాస కోటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. శ్రీకైలాస కోటేశ్వరస్వామి ఆలయంలో నెలలోని అమావాస్య తర్వాత వచ్చే మొదటి సోమవారం ఆలయంలో లక్షపువ్వుల అర్చనతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా శివునికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బల్లగణపతి, సిద్దయ్య, బాలయ్య, సిద్దయ్యతో పాటు భక్తులు సుధాకర్, రాజు, గడ్డమీది రాజు ఆలయ ప్రధాన పూజారి జంగం వంశీ ప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా రాంసింగ్

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 12: కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాంసింగ్ బాధ్యతలు స్వీకరించారు. అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని సోమవారం ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ అందించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌ను కేటాయించే వరకు రాంసింగ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని విభాగాలతో కోఆర్డినేషన్ చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందేవిధంగా కృషిచేస్తానని తెలిపారు.

'నాబార్డు ద్వారా సహకారం అందిస్తాం'

దోమకొండ, ఫిబ్రవరి 12: నాబార్డు సంస్థ ద్వారా దోమకొంగ ట్రస్ట్‌కు సహకారం అందజేస్తామని తెలంగాణ రాష్ట్ర నాబార్డ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల అన్నారు. సోమవారం దోమకొండలో గడికోట ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. మహిళలకు వృత్తి నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి పొందుటకు ట్రస్ట్ చేస్తున్న సేవలను మేనేజర్ బాబ్జి ఆమెకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా నాబార్డ్ అధికారి వాసుదేవరావు, ట్రస్ట్ ప్రతినిధులు గణేష్, వెంకటలక్ష్మీ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ముస్తాపూర్‌లో ప్రత్యామ్నాయ పాఠశాల ప్రారంభం

లింగంపేట, ఫిబ్రవరి 12: మండలంలోని ముస్తాపూర్‌లో సోమవారం ఇటుక బట్టీలలో పనిచేసే వలస కార్మికుల పిల్లల కోసం డీఈవో రాజు ప్రత్యేక పాఠశాలను ప్రారంభించారు. మహారాష్ట్ర నుంచి ఇటుక బట్టీలలో పనులు చేసేందుకు వలస వచ్చిన కార్మికుల పిల్లలు అక్కడే ఇటుక బట్టీలలో పనులు చేస్తున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని, వారికోసమే ప్రత్యేక పాఠశాలను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి, సీఆర్‌పి విజయ్, ఇటుక బట్టీల యజమానులు ఉన్నారు.



ముస్తాపూర్‌లో పాఠశాలను ప్రారంభిస్తున్న డీఈవో

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
ప్రియా 35	- యాత్ర-2	వెంకటేశ్వర	- లాల్ సలామ్
దర్శన్	- హనుమాన్	మహేశ్వరి	- ఈగల్
శాంతి	- గుంటూరు కారం		
ప్రియా 70	- ఈగల్, లాల్‌సలాం		

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	170	190
వెన్‌కాబ్(కిలో)	:	100	180	200

